క్లుప్తంగా

ఇంటి పట్టాల పంపిణీ



పిడుగురాళ్ల: పట్టణంలోని 9వ వార్డు పరిధిలో లబ్ధిదారులకు వార్డు కౌన్సిలర్ మాదాల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో 34 మందికి ఇంటింటికీ తిరిగి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కన్వీనర్లు ఒరుగంటి రవికుమార్, కొండా శివారెడ్డి, గృహ సారథులు చిల్లంచర్ల వెంకటేశ్వర్లు, వల్లంభట్ల నాగేశ్వరరావు, బి.శివన్నారాయణ, అంకిరెడ్డి, శ్రీను, రామారావు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

దాచేపల్లి : స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.రవికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఈ ఏడాది 5వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 21వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కార్మికుల భద్రతతోనే అభివృద్ధి సాధ్యం



దాచేపల్లి : పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రత ముఖ్యమని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జిల్లా అధికారి కె.రాంబాబు అన్నారు. మండలంలోని పెదగార్లపాడు చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీలో 53వ జాతీయ భద్రతా వారోత్సవాలు బుధవారం జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాంబాబు మాట్లాడుతూ..కార్మికుడు పనిచేసే ప్రదేశంలో భద్రత చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత యజమాన్యంపై ఉందని, కార్మికుడి భద్రత పరిశ్రమ అభివృద్ధికి తొలిమెట్టు అని చెప్పారు. కార్మికుడు పనిచేసేటప్పుడు తన కోసం ఇంటి వద్ద కుటుంబం ఎదురు చూస్తుందన్న విషయం గుర్తుంచుకుని భద్రతతో పనిచేయాలని సూచించారు. అనంతరం రాంబాబుని యాజమాన్య ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ జాయింట్ ప్రెసిడెంట్ సీహెచ్ సీతారాములు, హెచ్‌ఆర్ హెడ్ బి.వి. రాఘవరాజు, భద్రత అధికారి శ్రీకాంత్‌రెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్ షేక్ అన్వర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందించాలి

జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి



పిడుగురాళ్ల: 2024 ఖరీఫ్ పంటలు వేసేందుకు రైతులకు నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందించాల్సిన బాధ్యత విత్తన ఉత్పత్తిదారులు, పంపిణీ దారులు, డీలర్లు, అధికారులు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి అన్నారు. పట్టణంలోని ఫంక్షన్ హాల్లో బుధవారం విత్తన ఉత్పత్తిదారులు, పంపిణీ దారులు, డీలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి హాజరయ్యి మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో వాణిజ్య పంటలైన పత్తి, మిరప పంటల సాగు విస్తీర్ణం అధికంగా ఉంటుంది కనుక రైతుల ప్రాధాన్యతను బట్టి కావలసిన నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందించవలసిన బాధ్యత విత్తన ఉత్పత్తి దారులు, పంపిణీ దారులు, డీలర్లకు ఎంతైనా ఉందని అన్నారు. ఖరీఫ్‌లో పత్తి పంట 1,22,500 హెక్టార్లు, మిరప 75,220 హెక్టార్లు సాగు చేసే అవకాశం ఉందన్నారు. అందుకుగాను పత్తి 3,63,672 కేజీలు, మిరప 18,805 కేజీల విత్తనాలు అవసరం అవుతాయని చెప్పారు. రైతుల ప్రాధాన్యత ప్రకారం విత్తనాలను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్ రవికుమార్, రాష్ట్ర విత్తన, పురుగు మందుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, పల్నాడు జిల్లా విత్తన సంఘం అధ్యక్షుడు హనిమిరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి రమణా రెడ్డి, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

గీతాంజలి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

గురజాల : గొర్తి గీతాంజలి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని అఖిల భారత యాదవ మహాసభ పల్నాడు జిల్లా అధ్యక్షుడు సిద్ధాడపు గాంధీ అన్నారు. గీతాంజలి మృతికి బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మృతికి కారణమైన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారికి శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. అనంతరం రెవెన్యూ డివిజనల్ అధికారి జి రమణాకాంత్ రెడ్డి, డీఎస్పీ పల్లపురాజులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అనుగురాజు యాదవ్ విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు కంపసాటి వీరాంజనేయులు, ఎం.వంశీకృష్ణ, దేవండ్ల వెంకటనారాయణ, కె.సుబ్బారావు, మంచి అంజిబాబు, మంచి కాటంరాజు, గంధం చిన్న, బీసీ కులాల ఐక్య వేదిక పల్నాడు ఏరియా కమిటీ అధ్యక్షుడు తదితరులున్నారు.

గ్రామాభ్యుదయమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- రూ.2.20 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ భవనాల ప్రారంభం



పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: మండలంలోని గాదెవారిపల్లె గ్రామంలో రూ.2.20 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ భవనాల సముదాయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం ప్రారంభించారు. రూ.1.40 కోట్లతో నిర్మించిన గాదెవారిపల్లె పీహెచ్‌సీ భవనం, రూ.23 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.17 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.40 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే అనుబంధ గోడౌన్‌ను ప్రభుత్వ విప్ పీఆర్కే లాంఛనంగా ప్రారంభించారు. గత రెండు దశాబ్దాలుగా శిథిలావస్థలో, నిరుపయోగంగా ఉన్న పీహెచ్‌సీ భవనాన్ని పునర్నిర్మించి మళ్లీ పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం పట్ల పరిసర 11 గ్రామాల ప్రజలు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ విప్ పీఆర్కేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ గ్రామాభ్యుదయమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంతో కాలంగా అభివృద్ధికి నోచుకోని పేదలకు చేయూతనిస్తూ అలాగే గ్రామాలలోనే వారికి నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారన్నారు. అలాగే రైతులకు ఆర్‌బీకేలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రతి పనికి మండల కేంద్రానికి వెళ్లే పని లేకుండా గ్రామంలోనే వ్యవసాయ సేవలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బైరెడ్డి చినశ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ కూనిరెడ్డి సైదారెడ్డి, పార్టీ నాయకులు బైరెడ్డి కోటిరెడ్డి, కొత్తా కాశిరెడ్డి, గురజాల రామారావు, షేక్ సైదా, జెడ్పీటీసీ షేక్ షఫీ, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, మేకల శ్రీనివాసరెడ్డి, కిష్టపాటి అంకిరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, యర్రంరెడ్డి వీరారెడ్డి, ఆకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



గోదాము ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, మండల పార్టీ నాయకులు

ఎన్ని శక్తులు ఏకమైనా సీఎం వైఎస్ జగన్ గెలుపు తథ్యం



ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్ యార్డు పాలకవర్గంతో రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పీవీఆర్

- తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో బ్రహ్మారెడ్డి చేసిన అభివృద్ధి శూన్యం
- 5వసారి శాసనసభ్యునిగా పీఆర్కే విజయం తథ్యం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి

దుర్గి: ప్రజల దీవెనలతో రెండవ సారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించటం ఖాయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి దుర్గి మార్కెట్ యార్డు పాలక వర్గం ప్రమాణస్వీకార మహోత్సవానికి ఆయన ముఖ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు, పార్టీ నాయకులు, మహిళలు హాజరయ్యారు. కారెంపూడి మండల పార్టీ కన్వీనర్ కొంగర సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. నూతన చైర్మన్‌గా కొమ్ము కౌసల్య చేత యార్డు సెక్రటరీ రవికుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. వైస్ చైర్మన్‌గా గురజాల రామారావు, పాలక వర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పీవీఆర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అలజడులు సృష్టిస్తూ గ్రామాలలో ప్రజలను మభ్యపెట్టి లబ్ధిపొందాలని ప్రయత్నిస్తున్న జూలకంటి బ్రహ్మారెడ్డి ఆటలు సాగవని హెచ్చరించారు. గత 20 సంవత్సరాలుగా అధికారమున్నా లేకున్నా నియోజకవర్గ ప్రజల పక్షాన నిలబడి తాము సేవలందించిన విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. గత టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. రాబోవు ఆరు నెలల్లో వరికపూడిశెల ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి పల్నాటి రైతాంగం కల నెరవేర్చటం కేవలం సీఎం జగన్‌కే సాధ్యమన్నారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో ఎటువంటి విధ్వంసం, అరాచకాలు, హింసాత్మక ఘటనలు జరిగినా దానికి బ్రహ్మారెడ్డి పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఐదవ సారి శాసన సభ్యుడిగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గెలిపించుకొని వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తామని అభిమానుల హర్షధ్వానాల మధ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు శెట్టిపల్లి యలమంద, షేక్ షఫీ, రెంటచింతల ఎంపీపీ పాముల సంపూర్ణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెలిదండి గోపాల్, మాజీ ఎంపీపీలు దాసరి చౌడేశ్వరి, పార్టీ జిల్లా కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్, నవులూరి భాస్కర్ రెడ్డి, పార్టీ యూత్ కన్వీనర్ యకటీల బుచ్చిబాబు, మండల కన్వీనర్‌లు ఉన్నం పెద్దబ్బాయి, గొట్టం బ్రహ్మారెడ్డి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ మోర్తల ఉమామహేశ్వరరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్‌జానీ బాషా, పీఏసీఎస్ చైర్మన్ కటకం రామారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బొమ్మిన అల్లయ్య, మేకల శ్రీనివాసరెడ్డి, కటకం చిన వెంకటయ్య, తోటకూర నాగేశ్వరరావు, జంగా కొండలు, తోటకూర వెంకటేశ్వర్లు, చాట్ల శాంత రమేష్, రాయపాటి మాణిక్యం తదితరులున్నారు.

సురక్ష శిబిరాలకు విశేష స్పందన



పిడుగురాళ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రజలకు శ్రీరామ రక్షగా మారాయని పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు పత్రా అనిల్‌కుమార్ అన్నారు. పట్టణంలోని సంజీవరెడ్డినగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఎంపీపీఎస్ (తండా) స్కూల్లో నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 421 మంది వైద్య సేవలు పొందారని వైద్యులు తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంలో 38 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 22 మందికి కళ్లజోళ్లు అందించడం జరిగిందని తెలిపారు. ముగ్గురిని ఉన్నత ఆసుపత్రులకు మెరుగైన వైద్య సేవలకు రిఫర్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నవ్వులూరి అమరేశ్వరరెడ్డి, రవి తేజ, ఆంజనేయులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన



వెల్దుర్తి: మండలంలోని కొత్తపుల్లారెడ్డి గూడెంలో వాటర్ ఎయిడ్ బ్లాక్ కో ఆర్డినేటర్ మారబోయిన గురుప్రసాద్ బుధవారం రాత్రి ప్రజలకు మరుగుదొడ్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని వాడుకోవాలని, లేని వారు కట్టించుకోవాలన్నారు. మరుగుదొడ్డి నిర్మించుకోకుండా బహిరంగ మలవిసర్జన ద్వారా కలిగే అనారోగ్య సమస్యలు, ప్రాణ నష్టం గురించి వివరించటం జరిగింది. మహిళలు బహిర్భూమికి వెళ్లటం ద్వారా వారి ఆత్మగౌరవం దెబ్బతింటుందని, వారికి రక్షణ లేకుండా ఉందన్నారు. ముందుగా వాటర్ ఎయిడ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామంలో బ్యానర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్ రాగిడి లక్ష్మణరావు, వర్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చర్చి కమిటీ ఎన్నిక



దాచేపల్లి : స్థానిక క్రీస్తు కృపా లూథరన్ చర్చి డెలిగేట్‌గా బండ్ల జీవరత్నంబాబుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చర్చిలో బుధవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో పాస్టర్ మాచర్ల మోజేస్ అధ్యక్షతన ఎన్నికల పరిశీలకులు పాస్టర్ జీ శ్యామ్యేల్ ప్రసన్నకుమార్ పర్యవేక్షణలో ఈ ఎన్నిక నిర్వహించారు. డెలిగేట్‌గా జీవరత్నం బాబు, ఆల్టర్‌నేట్ డెలిగేట్‌గా బండ్ల కృపారావులను ఏకగ్రీవంగా సంఘస్తులు ఎన్నుకున్నారు. అనంతరం వీరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చాట్ల క్రాంతికుమార్, సంఘస్తులు పేరుపాగు రాజారావు, బండ్ల కిషోర్, బండ్ల యాకోబు, కొమ్ము బుజ్జి పాల్గొన్నారు.

ఓటును నిర్భయంగా వినియోగించుకోం



పోలీసు కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

దాచేపల్లి : సాధారణ ఎన్నికల్లో ఓటర్లు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్ఐ జీ సంధ్యారాణి అన్నారు. మండలంలోని పెదగార్లపాడు, తక్కెళ్లపాడు, కేసానుపల్లి గ్రామాల్లో కేంద్ర బలగాలతో మార్చ్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంధ్యారాణి మాట్లాడుతూ..ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పిస్తున్నామని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

గ్రామాల్లో పోలీస్ కవాతు

దుర్గి: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర రక్షణ బలగాలతో మండలంలోని ముటుకూరు, పోలేపల్లి, కోలగుట్ల, కంచరగుంట, పలు గ్రామాలలో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. కారెంపూడి సీఐ మల్లయ్య యాదవ్, ఎస్ఐ ఎస్.కోటయ్యల ఆధ్వర్యంలో కేంద్ర సీఐఎస్ఎఫ్ బెటాలియన్‌తో కవాతు నిర్వహించారు. సీఐ మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ గ్రామాలలో అలజడులు సృష్టించే కొందరు వ్యక్తులపై నిఘా ఉంచామని, అటువంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి గొడవలలో తలదూర్చవద్దని వివరించారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఎంతటి వారైనా ఉపేక్షించమని తెలిపారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు వివిధ పార్టీ నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు.

తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలి

దాచేపల్లి : ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని సీఐ ఎ.సురేంద్రబాబు అన్నారు. మండలంలోని తంగెడ సమీపంలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద భవ్య సిమెంట్స్ యాజమాన్యం సహకారంతో నిర్మించిన గదిని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో సీఐ మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సరిహద్దు మీదుగా రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అక్రమంగా డబ్బు, మద్యం తరలిస్తే స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు దాసరి శివనాగరాజు, జీ సంధ్యారాణి, ఫ్యాక్టరీ యూనిట్ హెడ్ ఎస్.బాబాఫక్రుద్దీన్, మైనింగ్ డైరెక్టర్ ఎన్.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక దృష్టి



తుమ్మకోట గ్రామంలో ఎన్నికల బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామ్‌మోహన్‌రావు

రెంటచింతల: మండలంలోని పలు గ్రామాలలో ఉన్న సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తహసీల్దార్ ఎస్.రామ్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం పశర్లపాడు, తుమ్మకోట, మంచికల్లు, కొత్తగంగరాజుపల్లె గ్రామాలలో ఉన్న 9 పోలింగ్ కేంద్రాలను ఆయన సెక్టార్ ఆఫీసర్లతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు గత ఎన్నికల సమయంలో ఏ పోలింగ్ బూత్‌ల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నాయో ఆ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించినట్లు తెలిపారు. ఆయా గ్రామస్తులతో మాట్లాడి ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మండల పరిధిలోని 11 గ్రామాలలో మొత్తం 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం లేకుండా మంచినీటి సదుపాయం, వృద్ధులకు ర్యాంప్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో అవసరమైతే పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్‌లు కూడా ఏర్పాటు చేసేందుకు స్థానిక రెవెన్యూ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సెక్టార్ ఆఫీసర్లు పి.సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఆర్ఐ దాసరి కాంతారావు, వీఆర్వోలు బి.మల్లికార్జునరెడ్డి, కె.బాలయ్య, వి.సైదారెడ్డి, బీఎల్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాచవరం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే రక్తహీనతకు గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సెక్టార్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ తెలిపారు. మండలంలోని పిన్నెల్లి గ్రామంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవడంతో పసిబిడ్డలకు పాలు సమృద్ధిగా అందుతాయని అన్నారు. రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శాలివాహన కుమ్మరి సంఘానికి కమ్యూనిటీ హాల్ నిర్మిస్తాం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



శాలివాహన కుమ్మరి సంఘం నాయకులతో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: శాలివాహన కుమ్మరి సంఘానికి నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలాన్ని అందించి, నిర్మాణానికి రూ.25 లక్షలు నిధులు అందిస్తానని స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో పట్టణ వెంకటేశ్వర శాలివాహన కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో బుధవారం మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరయ్యారు. మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాలివాహన సంఘం నాయకులు కమ్యూనిటీ హాల్ కావాలని కోరడంతో వారికి వెంటనే స్థలం అందిస్తామన్నారు. అలాగే నిర్మాణానికి తన వంతుగా రూ.25 లక్షలు అందించి కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. వెంకటేశ్వర శాలివాహన కుమ్మర సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, సమాచార మాజీ కమిషనర్ రేపాల శ్రీనివాసరావు, శాలివాహన కుమ్మర సంఘం అధ్యక్షులు ప్రొద్దుటూరి గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాడిశ మస్తాన్ రావు, కోశాధికారి కానాల వెంకటేష్, చల్లగి పాలకాలు, చీరాల వెంకటేశ్వర్లు, నారాయణపురం వీరయ్య, ఇల్లూరి వెంకయ్య, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

గురజాల : నగర పంచాయతీలోని జంగమహేశ్వరపురంలో భక్తుల పాలిట కల్పవృక్షమై వెలసి పలనాటి తిరుమలగా పేరుగాంచిన అలివేలు మంగా పద్మావతీ సమేత వెంకటేశ్వరస్వామి వారి 48వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, హోమం, బలిహరణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం కనుల పండువగా ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాసు

వెంకటేశ్వరస్వామి వారి తిరునాళ్ల పురస్కరించుకుని స్వామి వారిని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవుని దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, నగర పంచాయతీ చైర్మన్ పోలు పవన్మయి, వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, కౌన్సిలర్ పోలు వీరారెడ్డి, సుబ్బారెడ్డి, యెనుముల దివ్యవాణి, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, మాజీ ఎంపీపీ వీరంరెడ్డి అమరారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బి.ఇష్టకామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి కర్రా చినకోటేశ్వరరావు, మండల కార్యదర్శి కర్రా గిరిబాబు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పులిపాడులో వేంకటేశ్వర స్వామి కల్యాణం

మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో వేంచేసి యున్న అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ, కొమ్మినేని బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ, వేముల చలమయ్య, గుంటూరు రైల్వే మెంబర్ కె.రవిశంకర్, నాయకులు కాపూరి అంజిబాబు, పరిమి శ్రీను దర్శించుకున్నారు.

పేదల అభ్యున్నతికి పాటుపడిన మహానేత అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పీవీఆర్

దుర్గి: ప్రపంచ దేశాలలో మిన్నగా ఉన్న రాజ్యాంగం భారత రాజ్యాంగం మాత్రమేనని రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి దుర్గి బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి, మాట్లాడుతూ నేడు దేశాభివృద్ధికి అన్ని మతాలు, కులాల ప్రజలు ఐకమత్యంగా ఉండి అభివృద్ధి చెందుతున్నారంటే దానికి రాజ్యాంగమే కారణమన్నారు. గిరిజనులు, దళితులు, బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించి వారి అభ్యున్నతికి పాటుపడిన మహానేత అంబేడ్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, సర్పంచ్ రాయపాటి మాణిక్యం, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెలిదండి గోపాల్, పీఏసీఎస్ చైర్మన్ కటకం రామారావు, కన్వీనర్‌లు ఉన్నం పెద్దబ్బాయ్, యకటీల బుచ్చిబాబు, ఎంపీటీసీలు కటకం గోపాల్, సీతా గోవింద్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కటకం చిన వెంకటయ్య, ఊరిబండి మన్నెయ్య, శెట్టిపల్లి కోటేశ్వరరావు, తురక మణికంఠ, జంగా కొండలు, కపలవాయి వెంకటప్పయ్య, తోటకూర నాగేశ్వరరావు, గంగారపు వెంకటరెడ్డి, కొత్త వెంకటేశ్వర్లు, జక్కా రమేష్, పులిమెల మాణిక్యం, మాచర్ల మైఖేల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు



మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న శాలివాహన సంఘ నాయకులు

రెంటచింతల: మండల కేంద్రం రెంటచింతలలోని జాతీయ స్థూపం వద్ద తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు బుధవారం మండల శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు, విద్యావేత్త నారాయణపురం శ్రీనివాసరావు మాట్లాడుతూ మొల్ల తేట తెలుగులో రామాయణాన్ని రచించి శ్రీరామ చంద్రమూర్తికి అంకితం చేశారన్నారు. సాధారణ ప్రజలకు అర్థమయ్యే విధంగా సులభ శైలిలో రామాయణాన్ని రచించిన ఘనాపాటి మొల్ల అని కొనియాడారు. కడప జిల్లా గోపవరం మండలం, గోపవరం గ్రామానికి చెందిన మొల్లమాంబ రామాయణాన్ని 871 శ్లోకాలు, 8 ఖండాలుగా పాఠకులకు అందించిన మహాకవయిత్రిగా పేరు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసరావు, బి.తిరుపతిరావు, ఎస్.సిద్దయ్య, సీహెచ్ కోటేశ్వరరావు, బి.రాఘవేంద్ర, ఎస్.పోతులూరి, బి.మంగారావు, వి.కోటేశ్వరరావు, ఎస్.కాశయ్య, ఎన్.చిన మొలకయ్య, జి.కృష్ణ తదితరులున్నారు.

టీబీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మాతా అమృతానంద మయి ప్రతినిధి మల్లికార్జునరావు

వెల్దుర్తి: చెంచు, గిరిజనులు టీబీ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని మాతా అమృతానంద మయి ప్రతినిధి మల్లికార్జునరావు అన్నారు. బుధవారం మండలంలోని గుడిపాటి చెరువు, హనుమాపురం తండాలో చెంచు, గిరిజనులకు టీబీపై అవగాహన కల్పించారు. రెండు వారాల పాటు జ్వరం, దగ్గు, జలుబు సోకిన వారు టీబీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. పౌష్టికాహారం తినటం వలన టీబీ సోకకుండా ఉండవచ్చన్నారు. టీబీ లేని గ్రామాలను తయారు చేద్దామన్నారు. టీబీని మందుల ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. జ్వరం వచ్చిన వారు తగ్గకపోతే తమ దృష్టికి తీసుకొస్తే ఉచితంగా మందులు అందిస్తామన్నారు. ప్రభుత్వం టీబీ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం కోసం నెలకు రూ.500 ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చెంచు గిరిజనులు పాల్గొన్నారు.